# కేసీఆర్ సీఎం కావడం ఖాయం : ఎంపీ నామా

వైరాటౌన్, నవంబర్ 20 : రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారం, కేసీఆర్ ముఖ్యమంత్రిగా మూడోసారిఅధికారం చేపట్టడం ఖాయమని ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. వైరాలో మంగళవారం నిర్వహించే బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, పార్టీ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్‌తో కలిసి సోమవారం పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చడం ధ్యేయంగా పనిచేస్తున్నారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన ఆశీర్వాద సభలు విజయవంతం అయ్యాయని, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుత మ్యానిఫెస్టో అన్నివర్గాలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. బీజేపీ వారు పరిపాలించే రాష్ట్రాల్లో సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని, కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను పెట్టి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని పేర్కొన్నారు. మన రాష్ట్రాన్ని మనమే పరిపాలించుకోవాలని, మనమే అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ నామా, పక్కన రాములునాయక్, మదన్‌లాల్

## పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

కారేపల్లి, నవంబర్ 20 : వైద్య సిబ్బంది పర్యవేక్షణలో అసంక్రమిత వ్యాధిగ్రస్తులకు నెల నెలా పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేస్తున్నట్లు మాదారం పల్లెద వాఖాన వైద్యాధికారి తులసీదాస్ అన్నారు. స్థానిక పల్లె దవాఖానల్లో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి వారం గర్భిణులను పల్లెదవాఖానలకు తీసుకువచ్చి ఆరోగ్య పరీక్షలు చేయాలన్నారు. అదే విధంగా వారానికొకసారి బాలింతల ఇంటికి వెళ్లి మాతా, శిశువుల సంరక్షణను పర్యవేక్షించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించి, లక్షణాలు ఉన్న వారికి జ్వర పరీక్షలు చేయాలన్నారు. సమావేశంలో ఏఎన్ఎంలు జర్పల పుష్ప, వేప చందన, ఆశ కార్యకర్తలు పద్మ, విజయకుమారి, తేజావత్ లక్ష్మి, భాగ్యలక్ష్మి, అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైద్యాధికారి తులసీదాస్

## బీఆర్ఎస్‌లో 80 కుటుంబాలు చేరిక

వైరాటౌన్, నవంబర్ 20 : నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బానోతు మదన్‌లాల్ సమక్షంలో సోమవారం 80 కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మదన్‌లాల్ మాట్లాడుతూ కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారితో బానోతు మదన్‌లాల్

## ప్రజాశీర్వాద సభ ఏర్పాట్ల పరిశీలన

వైరాటౌన్, నవంబర్20 : వైరా నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, మాజీ ఎమ్మెల్యే, పార్టీ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ పరిశీలించారు. ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చడమే ధ్యేయంగా పనిచేస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ మూడోసారి అధికారం చేపట్టడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలను పెట్టి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎంపీ నామా, ఎమ్మెల్యే రాములునాయక్, అభ్యర్థి మదన్‌లాల్

## మదన్‌లాల్ గెలుపును కాంక్షిస్తూ మోటర్‌సైకిల్ ర్యాలీ


ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీటీసీ జడల వసంత, ర్యాలీలో పాల్గొన్న నాయకులు,కార్యకర్తలు



కారేపల్లి,నవంబర్ 20 : వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ గెలుపును కాంక్షిస్తూ ఎంపీటీసీ జడల వసంత ఆధ్వర్యంలో సోమవారం భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తొలుత పెట్రోల్ బంక్ వద్ద ఎంపీటీసీ వసంత జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. రెవెన్యూ కార్యాలయం, అంబేద్కర్, సినిమాహాల్ సెంటర్, బస్టాండ్ సెంటర్‌ల మీదుగా పోలీస్‌స్టేషన్, బీసీ కాలనీ, సంతరోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్, బొడ్రాయి సెంటర్‌ల వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు షేక్ గౌసుద్దీన్, ఎం.డీ.హనీఫ్, జడల కల్యాణ్, ఆదెర్ల రామారావు, చెవుల చందు, డొంకెన రవి, జూపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైరారూరల్, నవంబర్20 : తాటిపూడి గ్రామంలో సర్పంచ్ బట్టా పెద్ద భద్రయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ సంక్షేమ పథకాలు కొనసాగాలని, మళ్లీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. గ్రామగ్రామాన కేసీఆర్‌కు మద్దతు తెలుపుతున్నారని, కేసీఆర్ అంటే ఎన్నో సంక్షేమ పథకాలు గుర్తొస్తాయని ఆయన తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు వివరిస్తూ బీఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్ కారు గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు.


వైరారూరల్ : ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

# దివ్యాంగులు, వృద్ధులు ఇంటి వద్దనే ఓటు వేయవచ్చు




వైరాటౌన్ : ఓటు వేస్తున్న దివ్యాంగుడు, ఓటు వేస్తున్న వృద్ధుడు, పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్, అధికారి

వైరాటౌన్, నవంబర్ 20 : వైరా నియోజకవర్గంలో దివ్యాంగులకు ఓటు వినియోగించుకునేందుకు బ్యాలెట్ పత్రంపై ఇంటి వద్దనే ఓటు వేసే విధానాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, రిటర్నింగ్ అధికారి, అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్ సోమవారం ప్రారంభించారు. నియోజకవర్గంలోని వైరా, కొణిజర్ల, ఏన్కూరు, జూలూరుపాడు, కారేపల్లి మండలాల్లో 230 మంది దివ్యాంగులను ఎన్నికల అధికారులు గుర్తించి 50 మంది పోలింగ్ ఆఫీసర్లు, పోలీస్ సిబ్బందిని నియమించారు. దివ్యాంగులతో ఓటింగ్ చేయించేందుకు పోలింగ్ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బ్రాహ్మణపల్లిలో దివ్యాంగుడు షేక్ ఇబ్రహిం కుటుంబ సభ్యుల సహకారంతో ఓటు హక్కును వినియోగించుకున్నాడు. కార్యక్రమంలో కలెక్టర్ వీపీ గౌతమ్, పోలింగ్ ఏజెంట్లు, ఎన్నికల అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

కొణిజర్ల, నవంబర్20: ప్రత్యేక కేటగిరి ఉన్న ఓటర్లను తమ ఇళ్ల నుంచే ఓటు హక్కు వినియోగించుకునే ప్రక్రియ మండలంలో ప్రారంభమైంది. ప్రతి సారి నిర్వహించే ఎన్నికలకు వినూత్నంగా ఈ సారి 80 ఏళ్ల దాటిన వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేసేందుకు పేర్లు నమోదు చేయించుకోగా ఒక్కో నియోజకవర్గంలో మూడు రోజుల పాటు ప్రక్రియ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా కొణిజర్ల మండలంలోని చిన్నమునగాల, గోపతి గ్రామంలో అధికారులు వృద్ధుల ఓట్లను సేకరించారు. మండలంలో మొత్తం 65 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారులు, ఎంపీడీవో, ఎంపీవో, బూత్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు.


కొణిజర్ల : వృద్ధుల ఓట్లను సేకరిస్తున్న అధికారులు, సిబ్బంది

# కలెక్టర్ వాహనాన్ని తనిఖీ చేసిన అధికారులు


కలెక్టర్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు



కొణిజర్ల, నవంబర్20: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ విధుల్లో భాగంగా వైరా పర్యటనకు వెళ్తుండగా కొణిజర్లలోని చింతకాని క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన స్టాటిక్ సర్వేలెన్స్ టీం అధికారులు వాహనాన్ని ఆపి తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వ, పోలీస్ వాహనాలు, అభ్యర్థులు, రాజకీయ నాయకుల వాహనాలు, అంబులెన్స్‌లు, గూడ్స్ తదితర వాహనాలు అధికారులు తనిఖీలు చేశారు.